తెలుగు దినపత్రిక
ayabheridaily.com

# జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

సంపుటి : 01
సంచిక : 235
పేజీలు : 5
వెల : 4

మల్కాజిగిరి
మంగళవారం, 09-04-2024

జయభేరి పాఠకులకు..
శ్రేయోభిలాషులకు..
మిత్రులకు శ్రీక్రోధి నామ
తెలుగు సంవత్సరాది
ఉగాది శుభాకాంక్షలు
- ఎడిటర్

# ఒక్కో వ్యూహం.. ఒక్కో నియోజకవర్గం



రాష్ట్రంలోని 17 లోక్సభ నియోజకవర్గాల్లో కనీసం 14 స్థానాల్లోనైనా విజయం సాధించాలనే పట్టుదల తో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వం ఉంది. పక్కా ప్రణాళికతో, ఆచరణాత్మకమైన వ్యూహాలు, స్థానిక పరిస్థితులను ఆధారంగా చేసుకొని ఎప్పటి కప్పుడు రాజకీయపరమైన వ్యూహాలు మార్చుకొంటూ నిర్దేశించుకొన్న లక్షాలన్నిసాధించాలన్న పట్టుదలతో ఉంది. ఆ దిశ గా నాయకులు, కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలోని స్థానిక పరిస్థితులను నేతల నుంచి అడిగి తెలుసుకొని అప్పటికప్పుడు వ్యూహరచన చేస్తూ కేడర్కు దిశానిర్దేశం చేస్తూ ముఖ్యమంత్రి, టిపిసిసి అధ్యక్షుడు రేవంత్రెడ్డి తీవ్రస్థాయిలో కసరత్తులు చేస్తున్నారు.

...మిగతాది 2 లో



# 13 నుంచి కేసీఆర్ బస్సుయాత్ర

✍ జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 8

పార్లమెంట్ ఎన్నికల వేళ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్రకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 13 నుంచి ఆయన ప్రజల్లోకి రానున్నారు. ఆ రోజు చేవెళ్ల బహిరంగ సభలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. బహిరంగ సభల కంటే బస్సు యాత్రల వైపే గులాబీ బాస్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ప్రతి పార్లమెంట్ పరిధిలోని ప్రతి నియోజకవర్గానికి బస్సు యాత్ర చేస్తూ ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ పాల్గొననున్నట్లు సమాచారం. చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచే బస్సు యాత్ర ప్రారంభించనున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ నెల 13న కేసీఆర్ చేవెళ్లలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని


...మిగతాది 2 లో



# మాధవీలతకు సెక్యూరిటీ

✍ జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 8:

ఎన్నికల సమయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ లోక్సభ బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలతకు కేంద్రం సెక్యూరిటీ పెంచింది. మాధవీలతకు వై ప్లస్ భద్రత కల్పిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. వీఐపీ సెక్యూరిటీలో భాగంగా 11 మందికి పైగా CRPF భద్రతా సిబ్బంది ఆమె వెంట ఉంటారు. ఎంఐఎం కంచుకోట హైదరాబాద్ ఎంపీ స్థానం నుంచి మాధవీలత బరిలోకి దిగుతున్నారు. అసదుద్దీన్ ఒవైసీ అక్కడ సిట్టింగ్ ఎంపీగా ఉన్నారు. ఎన్నికలు కావడంతో ముప్పు ఉంటుందని ఆమెకు పదకొండు మందితో కూడిన వై ప్లస్ భద్రతను కేంద్రం ఆమోదించింది. ఆరుగురు సీఆర్పీఎఫ్ సెక్యూరిటీ ఆఫీసర్లు మాధవీలత వెంట ఉండి పహారా కాస్తారు. మరో ఐదుగురు భద్రతా సిబ్బంది బీజేపీ ఎంపీ అభ్యర్థి ఇంటి వద్ద సెక్యూరిటీగా ఉంటారు.కోఠిలోని మహిళా కళాశాలలో కొంపెల్ల మాధవీ లత రాజనీతి శాస్త్రంలో ఎంఏ చదివారు. మాధవీ లత విరించి హాస్పిటల్స్ చైర్పర్సన్ గా సేవలు అందిస్తున్నారు. ఆమె ఒక ప్రొఫెషనల్ భరతనాట్యం డాన్సర్. తన పిల్లలకు హోమ్స్కూల్కు ఎంచుకున్నట్లు ఆమె చెబుతుండేవారు. ఆమె లోపాముద్ర ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు. దాంతోపాటు మాధవీలత లతామా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలుగా చాలా మందికి సుపరిచితురాలు.హైదరాబాద్లోని తన లోపాముద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా నగరంలోని పలు ప్రాంతాల్లో పలు ఆరోగ్య సంరక్షణ, విద్య, ఆహార పంపిణీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తుంటారు. ముఖ్యంగా హింధూ ధర్మం, హిందూ సాంప్రదాయాలపై ఆమె మాట్లాడే మాటలు, ఇచ్చే ప్రసంగాలో ఎందరినో ఆకట్టుకున్నాయి. హైందవ సంస్కృతి, సాంప్రదాయాలపై ఆమె చేసే వ్యాఖ్యలు తరచుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి. ఈ ఎన్నికల్లో తాను కచ్చితంగా అసదుద్దీన్ ను ఓడించి హైదరాబాద్ ఎంపీగా ప్రజలకు సేవలు అందిస్తానని ధీమా చెబుతున్నారు.




# కచ్చాదీపే కాదు.. కొకో కూడా ఉంది

✍ జయభేరి, చెన్నై, ఏప్రిల్ 8 :

తమిళనాడుకు అతి సమీపంలో ఉన్న కచ్చతీవు ద్వీపాన్ని ఇందిరాగాంధీ శ్రీలంకకు అప్పగించడంపై పార్లమెంటు ఎన్నికల వేళ బీజేపీ, కాంగ్రెస్ డీఎంకే మధ్య మాటల యుద్ధం కొనసాగుతుంది. కచ్చతీవు ద్వీపం మన చేతి నుంచి వెళ్లిపోవడానికి కారణం కాంగ్రెస్సే అని ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా ఆరోపించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. 1983లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ, శ్రీలంక అధ్యక్షురాలు బండారి నాయక మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం కచ్చతీవు శ్రీలంక వశమైంది.

...మిగతాది 2 లో

# ఓ తండ్రి కన్నీటి గాధ

✍ జయభేరి, కరీంనగర్, ఏప్రిల్ 8 :

ఓ తండ్రి కన్నీటి గాథ ఇది.. గుండె మాటున ఆవేదన ఇది. 20 ఏళ్లు కంటికి రెప్పలా కాపాడి.. తనే ప్రాణంగా చూసుకున్న తండ్రిని కాదని ఆ యువతి ప్రేమ వివాహం చేసుకుంది. దీంతో ఆ తండ్రి మనసు విరిగిపోయి తన కూతురికే షాక్ ఇచ్చాడు. ఆమె బతికుండగానే శ్రద్ధాంజలి ఫ్లెక్సీ ఏర్పాటు చేసి దాన్ని ఇంటి ముందే కట్టి కన్నీరు మున్నీరుగా విలపించాడు. అంతే కాకుండా సోషల్ మీడియాలో వాటిని పోస్ట్ చేసి బంధువులందరికీ తన కూతురు చనిపోయిందని చెప్పాడు. తీవ్ర మనస్తాపంతో చేసిన ఆ తండ్రి

...మిగతాది 2 లో





# రెండేళ్లలో మొత్తం 27 ఉద్యోగ ప్రకటనలు

✍ జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 8 :

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఊపందుకోనుంది. ఇప్పటికే నిర్వహించిన రాతపరీక్షల తుది ఫలితాలను పార్లమెంటు ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే వెలువరించాలని భావిస్తోంది. ఈ మేరకు TSPSC కసరత్తులు చేస్తోంది. అప్పటివరకు రాతపరీక్షల తుది కీల వెల్లడి, జనరల్ ర్యాంకు జాబితాల ప్రకటన, సర్టిఫికేట్ వెరిఫికేషన్ పూర్తి చేయనుంది. ఈ మేరకు రెండు రానున్న నెలల్లో పూర్తిచేయాల్సిన పనులకు సంబంధించి ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గత రెండేళ్లలో మొత్తం 27




ఉద్యోగ ప్రకటనలు జారీ చేసింది. వీటిద్వారా 18 వేలకు పైగా ఖాళీలను భర్తీచేయాల్సి ఉంది. అయితే 2023లో ప్రశ్నపత్రాల లీకేజీ కారణంగా గ్రూప్1తోపాటు 5 ఉద్యోగ నోటిఫికేషన్లకు సంబంధించిన నియామక పరీక్షలు

...మిగతాది 2 లో

# బస్తర్ ల మోడీ భారీ సమావేశం



✍ జయభేరి, రాయ్ పూర్ , ఏప్రిల్ 8:

మావోయిస్టుల కంచుకోట బస్తరలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు ప్రధాని నరేంద్ర మోదీ. చత్తీస్గఢ్లో గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొమ్మును లూటీ చేసిందని ఆరోపించారు మోదీ. తాను అవినీతిపై యుద్ధం ప్రకటిస్తే విపక్షాలు మోదీ గ్యారంటీలపై విషం చిమ్ముతున్నాయని మండిపడ్డారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా అవినీతిని అంతం చేస్తానని అన్నారు.ఛత్తీస్గఢ్లోని బస్తర్లో జరిగిన విజయ్ సంకల్ప్ శంఖనాద్ మహారాలీలో ప్రసంగించిన ప్రధాని మోదీ కాంగ్రెస్పై విరుచుకుపడ్డారు. పేదల గురించి కాంగ్రెస్ ఏనాడూ పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ నేతలు పేదల హక్కులను లాక్కున్నారని ఆరోపించారు. పేదలకు హక్కులు కల్పించి సగౌర్వంగా జీవించేలా చేశామన్నారు. ప్రస్తుతం

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఒక్కో వ్యూహం.. ఒక్కో నియోజకవర్గం

లోక్సభ నియోజకవర్గాల వారీగా ప్రత్యర్థి పార్టీల్లో ఉన్న నాయకులు, వారి వ్యవహారశైలి, అసంతృప్తి నేతలు, బి ఆర్ఎస్, బిజెపి నేతల బలం, బలహీనతలను తెలుసుకొని నియోజకవర్గాల్లోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా అనుసరించాల్సిన రాజకీయపరమైన ఎత్తులు, పైఎత్తులపై పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని సీనియర్ నాయకులు, కేడర్తో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు.అంతేగాక లోక్సభ సెగ్మెంట్లలోని సామాజికాంశాలు, ఏ యే సామాజిక వర్గంలో ఏ పార్టీ వైపు ఉంది, ఏయే సామాజిక వర్గం రాజకీయ చైతన్యం ఎక్కువగా ఉంటుందో కూడా తెలుసుకొని వారందరినీ కాంగ్రెస్ పార్టీకి, హస్తం గుర్తుకు ఓటు వేసే విధంగా అనుసరించాల్సిన విధివిధానాలపై సీఎం రేవంత్రెడ్డి దిశానిర్దేశం చేస్తున్నారని కొందరు సీనియర్ కాంగ్రెస్ నాయకులు వివరించారు. అందులో భాగంగానే ఆదివారం సికింద్రాబాద్, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ నాయకులతో సిఎం రేవంత్రెడ్డి వేర్వేరుగా సమావేశమయ్యారు. అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని ముఖ్యమంత్రి ఈ రెండు నియోజకవర్గ నాయకులకు దిశానిర్దేశం చేశారు.సికింద్రాబాద్ నియోజకవర్గంలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ బలం ఈ మూడునెలల్లో పెరిగిందని, అసెంబ్లీ ఎన్నికల కంటే ప్రస్తుతం కేడర్ బలంగా తయారయ్యిందని దీనిని నాయకులంతా సద్వినియోగం చేసుకోవాలని సిఎం రేవంత్ ఆ నియోజకవర్గ నాయకులతో పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో 14 ఎంపి స్థానాలు తగ్గకుండా మనం గెలుచుకోవాలని ఆ దిశగా కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని సిఎం రేవంత్ పిలుపునిచ్చారు. అయితే సికింద్రాబాద్ అభ్యర్థిగా ఇప్పటికే దానం నాగేందర్ను కాంగ్రెస్ పార్టీ ప్రకటించగా ఆయన ఖైరతాబాద్ ఎమ్మెల్యే స్థానానికి రాజీనామా చేయాలన్న కండీషన్ను విధించినట్టుగా తెలిసింది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన ఎమ్మెల్యే స్థానానికి రాజీనామా చేయడానికి సుముఖత వ్యక్తం చేయడంతో ఆయన్ను అభ్యర్థిగా మార్చుతారా లేదా అన్నది ప్రస్తుతం సస్పెన్స్గా మారింది సికింద్రాబాద్ నియోజకవర్గ సమావేశంలో దానం నాగేందర్ కూడా హాజరుకావడంతో అభ్యర్థి మార్పుపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ సమావేశంలో మాత్రం సికింద్రాబాద్ ఎంపి అభ్యర్థి మార్పు ఉండదని నియోజకవర్గ నేతలతో సిఎం రేవంత్ స్పష్టం చేసినట్లుగా తెలుస్తోంది. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశంలో ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన అభ్యర్థులు హాజరుకావడంతో ఈసారి కచ్చితంగా ఓడిపోయిన స్థానాల్లోనూ కాంగ్రెస్ ఓటు బ్యాంకు కచ్చితంగా సికింద్రాబాద్ ఎంపి అభ్యర్థికే పడేలా కృషి చేయాలని సిఎం రేవంత్ ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన అభ్యర్థులకు సూచించినట్టుగా తెలిసింది. జూబ్లీహిల్స్ నుంచి పోటీచేసిన అజారుద్దీన్, నాంపల్లి నుంచి పోటీ చేసిన ఫిరోజ్ఖాన్, సనత్నగర్ ఎమ్మెల్యే అభ్యర్థితో పాటు హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మిలు సైతం ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## కేసీఆర్ బస్సుయాత్ర

జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎండిన పంటలను పరిశీలించాలని కేసీఆర్ ఇటీవల పొలంబాట పట్టారు. అందులో భాగంగా ఈ నెల 5న కరీంనగర్ జిల్లాలో పర్యటించారు. పలు నియోజకవర్గాల్లో ఎండిన పంటలు పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు. రైతులు ధైర్యంగా ఉండాలని.. బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పలువురు రైతులు ఆయనకు సమస్యలు ఏకరువు పెట్టారు. సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గులాబీ బాస్ దృష్టికి తెచ్చారు. మంచినీళ్లకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కొందరు చెప్పారు. దీనిపై స్పందించిన కేసీఆర్.. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు జనగామ సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో కేసీఆర్ పర్యటించారు.

తెలంగాణలో అన్నదాతలు మళ్లీ ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి వస్తుందని అనుకోలేదని.. ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో అంతా ఆలోచించాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. పంటలు పరిశీలించిన అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'కాంగ్రెస్ 100 రోజుల పాలనలో 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉన్న తెలంగాణకు స్వల్ప కాలంలోనే ఈ దుస్థితి ఎందుకు రావాలి.?. సాగునీళ్లు ఇస్తారని నమ్మి రైతులు పంటలు వేసుకున్నారని.. ముందే చెబితే వేసుకునే వాళ్లం కాదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. ఇంత కష్టకాలం వస్తుందని నేను ఎప్పుడూ అనుకోలేదు.' అని కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

## కచ్చాదీవే కాదు..

వాస్తవం అయితే.. ఇందిరాగాంధీ అప్పటి పరిస్థితుల ఆధారంగా నిర్ణయం తీసుకుని ఉంటారని కొందరు పేర్కొంటున్నారు.అయితే నాటి నిర్ణయాలను తప్పుగా ఎత్తి చూపుతున్న ప్రధాని నరేంద్రమోదీ.. నాడు తీసుకున్న నిర్ణయాలు సరైనవేనా అన్న చర్చ జరుగుతోంది. ప్రస్తుతం మోదీ నిర్ణయాలు అందరికీ నచ్చినా.. భవిష్యత్లో అవి చాలా మందికి తప్పుగా అనిపించవచ్చు అన్న చర్చ కూడా జరుగుతోంది. కాలమాన పరిస్థితుల ఆధారంగా మాజీ ప్రధానులు పనిచేశారని, అప్పటి ఆలోచనలు, నిపుణులు, భద్రత అంశాల మేరకు నిర్ణయాలు తీసుకుని, ఒప్పందాలు చేసుకుని ఉంటారని చాలా మంది పేర్కొంటున్నారు.ఇదిలా ఉంటే.. నాటి ప్రధానులకు దూర దృష్టి ఏది అని మరికొందరు వాదిస్తున్నారు. దేశాన్ని పాలిస్తున్న ఏ నేతకైనా దూరదృష్టి అనేది ముఖ్యం అని పేర్కొంటున్నారు. భవిష్యత్ను దృష్టిలో ఉంచుకునే నిర్ణయాలు, ఒప్పందాలు చేయాలని సూచిస్తున్నారు. అప్పటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తీసుకునే నిర్ణయాలు భవిష్యత్ తరాలకు శాపాలుగా మారతాయని పేర్కొంటున్నారు. అందులో భాగమే కచ్చతీవు ద్వీపం శ్రీలంకకు అప్పగించే నిర్ణయమని అంటున్నారుఇందిరా నిర్ణయంపై ఒకవైపు దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుండగా, తాజాగా మరో దీవి కూడా చేతులు మారిన విషయం వెలుగులోకి వచ్చింది. దేశ తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ తీసుకున్న నిర్ణయమే ఇందుకు కారణమని తెలుస్తోంది. నెహ్రూ అనేక నిర్ణయాలు దేశానికి నష్టం కలిగించాయన్న వాదన ఇప్పటికే ఉంది. తాజాగా మన ద్వీపాన్ని పొరుగున ఉన్న మయన్మార్కు అప్పగించడం, ఆ తర్వాత ఆ ద్వీపాన్ని మయన్మార్ చైనాకు అప్పగించడం చర్చనీయాంశమైంది.భారత దేశం చుట్టూ అనేక దీవులు ఉన్నాయి. అవన్నీ చాలా ఏళ్లుగా భారత అధీనంలోనే ఉన్నాయి. కానీ, నెహ్రూ మయన్మార్కు అతి సమీపంలో ఉన్న భారతీయ దీవులు అయిన కోకో ఐల్యాండ్స్ను మన పొరుగున ఉన్న మయన్మార్కు పుక్కిటికి రాసిచ్చేశారు. ఎప్పుడు సైనిక పాలనలో ఉండే మయన్మార్.. తన స్వప్రయోజనాల కోసం దానిని చైనాకు అప్పగించింది. మనకు కోకో దీవులు పనికిరావని నెహ్రూ భావించడమే ఇందుకు కారణంభారత్ నుంచి మయన్మార్, అక్కడి నుంచి చైనా అధీనంలోకి వెళ్లిన కోకో ఐలాండ్స్లో ఇప్పుడు ఆ దేశం మిసైల్స్ను మోహరించింది. అదీ భారత్వైపు గురిపెట్టడం ఇపుపడు ఆందోళనకు కారణం. నెహ్రూ దూరదృష్టి లేకుండా తీసుకున్న నిర్ణయం ఇప్పుడు భారత్కే ముప్పుగా మారడం గమనార్హం.

## ఓ తండ్రి కన్నీటి గాథ

చేసిన పనికి బంధువులతో పాటు స్థానికులూ షాక్ అయ్యారు. ఇదీ తీవ్ర చర్చనీయాంశమై వైరల్ అవుతోంది. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగింది. సిరిసిల్ల జిల్లాలో ఈ ఘటన సంచలనంగా మారింది. పట్టణంలో చిలువేరి మురళి కుమార్తె అనూష.. ఓ అబ్బాయిని ప్రేమించి ఇంటి నుంచి వెళ్లిపోయి పెళ్లి చేసుకుంది. ఈ విషయం తెలిసిన తల్లిదండ్రులు షాక్ గు గురయ్యారు. తమ కూతురు అలాంటి పని చేయదని.. తన బిడ్డను మభ్య పెట్టి ఆ యువకుడు పెళ్లి చేసుకున్నాడని కన్నీరు మున్నీరుగా విలపించారు. కంటికి రెప్పలా చూసుకున్న కూతురు అలా చేయడంతో తట్టుకోలేని ఆ తండ్రి తీవ్ర మనస్తాపంతో కూతురికే షాక్ ఇచ్చాడు. ఇంటి ముందే ఆమె శ్రద్ధాంజలి ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. అంతే కాకుండా దీన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి బంధువులు అందరికీ తన కూతురు చనిపోయిందని చెప్పాడు. తీవ్ర మనస్తాపం, ఆవేదనతో ఆ తండ్రి చేసిన పనికి అంతా షాక్ అయ్యారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. 'అమ్మలారా.. అయ్యలారా.. నా బిడ్డ వెళ్లిపోయింది. మంచిగా కాలేజీలో చదువుతోన్న అమ్మాయిని కొందరు ట్రాప్ చేశారు. ఇలా ఎవరూ బతకొద్దు. అమ్మా ఎవరూ ఇలా చేయకండి. మీ తల్లిదండ్రులను మోసం చేయకండి. మీ కాళ్లు మొక్కుతా.' అంటూ ఆ తండ్రి వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు.

ముందుగా 'జయభేరి' న్యూస్ ప్రేక్షకులందరికీ
శ్రీక్రోధి నామ తెలుగు సంవత్సరాది
ఉగాది పండుగ శుభాకాంక్షలు....
అందిస్తూ కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్ సమగ్ర విశ్లేషణ..

## కోపాన్ని తగ్గించుకొని సమాధానాన్ని వెతకడమే

# శ్రీక్రోధి నామ సంవత్సరం...



✍ జయభేరి, హైదరాబాద్ :

కాలాన్ని లెక్క కట్టినది ఉగాది...
తిథి వార నక్షత్ర యోగాలను మానవ జీవనస్థితిగతులను కాలచక్ర గతిని ముందుగానే పసిగట్టిన మన హిందూ సనాతన ధర్మానికి ఆయువుపట్టు మొదటి మెట్టు ఉగాది పండుగ సంబరాలు అంబరాన్ని తాకుతాయి. హిందూ సనాతన సంప్రదాయ పండుగలలో తొలి పండుగగా పేరు సంపాదించుకున్న పండుగ తెలుగు సంవత్సరాది ఉగాది. కాలాన్ని లెక్క కట్టే తెలుగు సంవత్సరాలలో 38వ సంఖ్య క్రోధి నామ సంవత్సరం. ఈ ఏడాది స్వాగతం పలుకుతుంది...
తెలంగాణ అంటేనే ఆత్మ గౌరవ పోరాట స్ఫూర్తి కి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుంది. ఇలాంటి నేపథ్యంలో ఉన్న మన రాష్ట్రంలో ఉగాది పండుగ అంటే మన అస్తిత్వాన్ని సనాతన ధర్మాన్ని మరొక్కసారి గుర్తు చేసుకుని తెలుగు సంవత్సర ప్రారంభాన్ని చేసుకుంటాం.

**ఉగాది పండుగ నాడు పొద్దున్నే స్త్రీలు తలంటు స్నానం చేసి శుభ్రమైన బట్టలు ధరించి పిల్లలు కొత్త బట్టలు ఆటపాటలతో పల్లె తల్లి ప్రకృతి శోభను తనలో నింపుకొని మావిడాకుల తోరణాలతో ప్రతి గడప ముస్తాబై ఇష్ట ఆరాధ్య దైవాలకు పూజలు మహా ఘనంగా జరుగుతాయి. ఉదయాన్నే ఇంట్లో ఉండే స్త్రీలు తలంటు స్నానం చేసి కొత్త బట్టలు ధరించుకొని దేవుడికి పూజ చేసిన తరువాత షడ్రు రుచుల సంగమాన్ని తయారు చేసుకుని ప్రసాదంగా తీసుకుంటారు. తీపి పులుపు చేదు కారం వగరు ఉప్పు ఇలా అన్ని రుచులను మిళితం చేసుకొని కొత్త కుండలో పచ్చడిని తయారు చేసుకొని ఇంటిల్లి పాదులు తీసుకుంటారు.. ఇలా తీసుకోవడం వలన సనాతన సాంప్రదాయ రీతిలో మన అస్తిత్వాన్ని కాపాడుకుంటూ ఆచారంతోపాటు ఆహారాన్ని భుజించి వ్యవహారాన్ని నడిపించే హిందూ సనాతన సాంప్రదాయ గొప్పతనాన్ని ప్రారంభ సంవత్సరంలో ఇలా మొదలు పెట్టుకుంటాం..**

**ఆరు రుచుల సంగమాన్ని సేవించిన తర్వాత కష్టం సుఖం దుఃఖం సంతోషం ఆనందం ఇలా మన జీవితంలో ఎదురయ్యే అన్ని కష్టసుఖాలను సమపాళ్ళుగా చేసుకొని వాటిని ఎదుర్కొనే ఆత్మస్థైర్యాన్ని పొందుకోవడానికి ఉగాది పచ్చడను వజ్రతుల్యంగా ఉన్న మన దేహాన్ని అమృతతుల్యంగా మార్చుకోవడం కోసం ఉగాది పచ్చడను కచ్చితంగా మనం సేవించాలి...**

తెలుగు భాష సంస్కృతి విభిన్న రీతిలో మన సనాతన సంప్రదాయాన్ని పాటిస్తూ ఈ రోజున చివరగా పంచాంగ శ్రవణాన్ని తెలుసుకుంటారు. పంచాంగ శ్రవణం అంటే తిథి వార నక్షత్ర యోగ గమనాల సమహారం అని చెప్పొచ్చు.. నిజానికి ఇక్కడే కాలాన్ని లెక్క కట్టే ఒక మేధో సంపత్తిని మన ధర్మం ఏనాడో కాలాన్ని లెక్క కట్టి మానవ జీవితంలో ఎదురయ్యే స్థితిగతులను తెలుసుకుంటూ కాలచక్ర గతి నియమాలను లెక్కిస్తూ పంచాంగ శ్రవణాన్ని మనకు పరిచయం చేసింది... పంచాంగ శ్రవణంలో తిథి వార నక్షత్ర యోగాలను కాలచక్రం యొక్క గతిని తెలుసుకొని జీవితంలో మానసికంగా దృఢంగా ఉండడానికి ఎదురయ్యే కష్టాలను ముందుగానే పసిగట్టి వాటిని ఎలా ఎదుర్కోవాలో వివిధ రకాల ఆధ్యాత్మిక విప్లవానికి సంసిద్ధులంగా చేస్తోంది ఉగాది పండగ.
మానవ జీవితాన్ని ప్రకృతితో ముడి పెడుతూ ఎన్నో విషయాలను మనం గతంలోని తెలుసుకున్నాం. నిజానికి మానవ శరీరంలో నీటి శాతం సగభాగం ఉంటుంది కాబట్టి ప్రకృతిలో కూడా నీటి భాగం సగభాగం ఉంటుంది. అంటే ప్రకృతితో మమేకమైతేనే మానవ జీవన విధానం సాఫీగా సాగుతుందనేది మనం ఆధ్యాత్మికంగా నేర్చుకోవలసిన ప్రాముఖ్యమైన విషయం.

**ఇక ఉగాది పంచాంగ శ్రవణం విన్న తర్వాత మనలో చాలామంది పేరుగాంచిన కవులు ఉగాది కవి సమ్మేళనాలను ఘనంగా నిర్వహిస్తారు. ఇక కష్ట సుఖాలను మంచి చెడులను దుఃఖ ఆనందాలను తెలియజేస్తూ ఉగాది పచ్చడి ఎలా అయితే తీసుకున్నామో అలాగే కాలచక్రాన్ని కాల గమనాన్ని పంచాంగ శ్రవణం ద్వారా తెలుసుకొని మనకు ప్రకృతిలో రాత్రి పగలు ఎలా ఉంటాయో అలాగే ప్రతి భార్య భర్త ఎలాంటి గొడవలు ఉన్న వాటిని వెనువెంటనే పరిష్కరించుకొని కలిసి జీవితాన్ని పంచుకోవాలని తెలుగు సంవత్సరాది మనకు ఓ చక్కని సందేశాన్ని బోధిస్తోంది...**

కవి సమ్మేళనంలో ఉగాది పండుగను గురించి విభిన్న రకాలుగా అక్షరమాలలను సంధిస్తూ కవులు తన కవిత్వాలను విప్లవాత్మకంగా కొందరు రాస్తే వివరనాత్మకంగా మరికొందరు రాస్తారు.. ఏదేమైనా 38వ క్రోధినామ సంవత్సరంలో మనం తెలుసుకోవాల్సింది మనలో ఉన్న కోపాన్ని ఆవేశాన్ని తగ్గించుకొని సమాధానాలను వెతుక్కోవాలనిజయభేరి న్యూస్ కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్ .....
మీ అందరినీ కోరుకుంటున్నాం.....
సర్వేజనా సుఖినోభవంతు ...
సర్వేజనా సుజనో భవంతు
శుభం భూయాత్....



✍ కడారి శ్రీనివాస్
కాలమిస్ట్, సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత
గాయకులు, సామాజిక ఉద్యమకారులు

## మోడీ భారీ సమావేశం

దేశం మొత్తం మరోసారి మోదీ సర్కార్ అంటున్నారు.దేశంలోని ప్రతి పేదవాడికి నేను అండగా ఉంటానని ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు..బీజేపీ ప్రభుత్వం పేదల కోసం ఒక్కొక్కటిగా పథకాలు తీసుకువచ్చి వారి హక్కులను కల్పించిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ప్రభుత్వం చేస్తున్న ఈ కృషి ఫలితంగానే దేశంలో 25 కోట్ల మందికి పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారన్నారు. పేదవారి ప్రతి ఆందోళనను తొలగించే వరకు విశ్రమించనని నిర్ణయించుకున్నానని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రారంభించామన్నారు. ఆయుష్మాన్ పథకం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని గుర్తు చేశారు.దశాబ్దాల తర్వాత దేశం సుస్థిరమైన, బలమైన బీజేపీ ప్రభుత్వాన్ని చూసిందని ప్రధాని మోదీ అన్నారు. పేదల సంక్షేమమే మా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. స్వాతంత్ర్యానంతరం పేదల అవసరాలను కాంగ్రెస్ ప్రభుత్వాలు దశాబ్దాలుగా పట్టించుకోలేదు. కాంగ్రెస్ ఎప్పుడూ పేదల గురించి పట్టించుకోలేదు, వారి సమస్యలను అర్థం చేసుకోలేదు. కాంగ్రెస్ కుటుంబంలోని ధనవంతులకు ద్రవ్యోల్బణం అంటే అర్థం కాలేదన్నార ప్రధాని మోదీ.పేదలకు ఉచితంగా రేషన్, వ్యాక్సిన్ ఇచ్చామని ప్రధాని మోదీ అన్నారు. కరోనా కాలాన్ని ప్రస్తావిస్తూ, ప్రధాని మాట్లాడుతూ, కరోనా సమయంలో ప్రజలు భారతదేశం ఎలా మనుగడ సాగిస్తుందని చెప్పేవారు? కాంగ్రెస్ హయాంలో దేశంలో వ్యాక్సిన్ రావడానికి దశాబ్దాలు పట్టేది. భారత దేశంలోని ప్రతి పేదవాడికి అండగా ఉంటానని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. పేదలకు ఉచితంగా వ్యాక్సిన్, ఉచితంగా రేషన్ ఇచ్చామని గుర్తు చేశారు.2014కి ముందు లక్షల కోట్ల రూపాయల కుంభకోణాలు జరిగాయని ప్రధాని మోదీ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఢిల్లీ నుంచి ఒక్క రూపాయి వస్తే, అదీ గ్రామాలకు 15 పైసలు మాత్రమే వచ్చేవి. మిగిలిన 85 పైసలను కాంగ్రెస్ వారే కొల్లగొట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ దోచుకునే ఈ వ్యవస్థను ఆపానని స్పష్టం చేశారు మోదీ. అవినీతి పరుల నల్లధనాన్ని అడ్డుకున్నానని, బీజేపీ ప్రభుత్వం తన పదేళ్లలో రూ.34లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు పంపించినట్లు ప్రధాని మోదీ తెలిపారు.

## ఉద్యోగ ప్రకటనలు

రద్దయ్యాయి. ఆ తర్వాత మళ్లీ నిర్వహించినా టెక్నికల్ సమస్యలతో ఫలితాలు వెల్లడికాలేదు. ఎట్టకేలకు ప్రశ్నపత్రాల లీకేజీ కారణంగా భ్రష్టుపట్టిన టీఎస్పీఎస్సీని కొత్త ప్రభుత్వం ప్రక్షాళన చేసింది. ఛైర్మన్తోపాటు కమిషన్కు సభ్యుల నియామకం చేపట్టింది. టీఎస్పీఎస్సీ ఛైర్మన్గా మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో టీఎస్పీఎస్సీ కొత్త బోర్డు ఏర్పాటైంది.

**10 నోటిఫికేషన్ల జనరల్ ర్యాంకు జాబితాలు వెల్లడి..**

కొత్తగా ఏర్పాటైన బోర్డు రెండు నెలల్లోనే మూడు నోటిఫికేషన్ల నియామక ప్రక్రియ పూర్తిచేసింది. దీంతోపాటు పది ఉద్యోగ ప్రకటనలకు జనరల్ ర్యాంకు జాబితాలను కమిషన్ విడుదలచేసింది. వీటితోపాటు కొత్తగా జారీచేసిన గ్రూప్1 నోటిఫికేషన్తోపాటు.. కీలకమైన గ్రూప్2, 3తోపాటు డీఏవో, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు రాతపరీక్ష తేదీలను టీఎస్పీఎస్సీ ప్రకటించింది.
ఇప్పటికే జనరల్ ర్యాంకు జాబితాలు ప్రకటించిన ఉద్యోగాలకు సంబంధించి త్వరలోనే సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేపట్టనుంది. ఇందులో భాగంగా జిల్లా స్థాయి పోస్టులైన గ్రూప్4 ఖాళీల భర్తీకి త్వరలోనే 1:3 నిష్పత్తిలో మెరిట్ జాబితాలు వెలువరించనున్నారు. మరోవైపు ఏఈఈ పోస్టులకు సంబంధించి జనరల్ అభ్యర్థులకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయింది. ఇక స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తికాగానే.. తుది ఫలితాలు వెల్లడించనున్నారు. ఏఈ పోస్టులకు సంబంధించిన తుది ఆన్సర్ కీని టీఎస్పీఎస్సీ తాజాగా ప్రకటించింది. ఇంటర్ విద్యా విభాగంలో 1,392 జూనియర్ లెక్చరర్ పోస్టులకు 2022 డిసెంబరులో ఉద్యోగ ప్రకటన జారీ అవగా 2023 అక్టోబరులో రాత పరీక్షలు పూర్తయ్యాయి. వారం, పది రోజుల్లోకి వెల్లడించాలని భావిస్తోంది.ఉద్యోగ నియామకాలకు నిర్వహించే రాతపరీక్షల ప్రాథమిక 'కీ' అనంతరం అభ్యంతరాలకు అవకాశం లేకుండా.. ఉండేందుకు కమిషన్ తగు కార్యచరణ సిద్ధం చేసింది. గతంలో ప్రశ్నపత్రం రూపొందించే సమయంలోనే నిర్ణయించిన సమాధానాన్ని ప్రిలిమినరీ ఆన్సర్ 'కీ'గా ఇచ్చేవారు. ఆన్సర్ కీ విడుదల చేసిన తర్వాత.. అభ్యర్థుల నుంచి వచ్చిన అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకుని, సబ్జెక్టు నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి తుది నిర్ణయం తీసుకునేవారు. దీనివల్ల ఫైనల్ ఆన్సర్ కీ, ఆ తర్వాత ఫలితాల వెల్లడికి చాలా సమయం పట్టేది. ఈ నేపథ్యంలో ముందుగానే సబ్జెక్టు కమిటీ జవాబులు పరిశీలించి ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రాథమిక కీ వెలువరిస్తోంది. దీంతో అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు దాదాపు తగ్గిపోతున్నాయి. అప్పటికీ ఏమైనా ఉంటే.. మరోసారి పరిశీలించి తుదికీ వెలువరిస్తోంది.



## రాహుల్ గాంధీ తప్పుకోవడం బెటర్

✍ జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 8:

పొలిటికల్ స్ట్రాటెజిస్ట్ ప్రశాంత్ కిశోర్ రాహుల్ గాంధీపై కీలక వ్యాఖ్యలు చేశారు. లోక్సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆశించిన స్థాయిలో ఫలితాలు రాబట్టలేకపోతే రాహుల్ గాంధీ రాజకీయాల నుంచి తప్పుకునే ఆలోచన చేయాలని సెటైర్లు వేశారు. ఏదో నడపాలంటే నడపాలన్నట్టుగా పార్టీని నడిపిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో ఆయనకు ఏం చేయాలో అర్థం కావడం లేదని అన్నారు. అటు తప్పుకోడానికి వీల్లేక, అటు పూర్తి స్థాయిలో కాంగ్రెస్ని లీడ్ చేయడం ఇష్టం లేక అవస్థలు పడుతున్నారని తేల్చి చెప్పారు. పదేళ్ల పాటు కాంగ్రెస్కి అధ్యక్షుడిగా పని చేసి కూడా ఏమీ చేయలేకపోయారని మండి పడ్డారు. నిజానికి ప్రశాంత్ కిశోర్ కాంగ్రెస్కి ఎన్నికల వ్యూహకర్తగా ఉండాల్సింది. కానీ కొన్ని భేదాభిప్రాయాల వల్ల ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నారు పీకే. "పదేళ్లుగా ఎలాంటి సక్సెస్ లేకుండా చేసిన పనే చేయడం వల్ల ఎవరికి ఉపయోగం..? కొద్ది రోజుల పాటు విరామం తీసుకోవడం మంచిది. వేరే వ్యక్తికి ఆ అవకాశం ఇవ్వాలి. అలాంటి సమయంలోనే మీరు (రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ) తల్లి సోనియా గాంధీకి అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆమె ఆ బాధ్యతలు చేపట్టాల్సి వచ్చింది" **ప్రశాంత్ కిశోర్, ఎన్నికల వ్యూహకర్త**
రాజీవ్ గాంధీ హత్య తరవాత సోనియా గాంధీ రాజకీయాల నుంచి తప్పుకోవాలనుకున్నా పార్టీని నడిపే సరైన వ్యక్తి లేకపోవడం వల్ల ఆమె కొనసాగాల్సి వచ్చిందని గుర్తు చేశారు పీకే. ఆయన అనుకున్నది అనుకున్నట్టుగా చేసే వ్యక్తులనే ఎక్కువగా నమ్ముతున్నారని, అది సరైన పద్ధతి కాదని వెల్లడించారు. 2019 లోక్సభ ఎన్నికల ఫలితాల తరవాత అసలు పార్టీ వ్యవహారాలే చూడనని చెప్పిన రాహుల్...ఇప్పుడు పూర్తి స్థాయిలో పార్టీని మోయాల్సి వస్తోందని అన్నారు. చాలా మంది నేతలు ఇప్పటికీ సొంతగా నిర్ణయం తీసుకోలేకపోతున్నారని విమర్శించారు. మిగతా పార్టీలతో ఎన్ని సీట్లు పంచుకోవాలన్న అభిప్రాయాల్నీ స్వేచ్ఛగా వ్యక్తం చేయలేకపోతున్నారని స్పష్టం చేశారు.

# ఎస్ఎల్బీసీ,డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయాలి

✍ జయభేరి, దేవరకొండ :




దేవరకొండ,మునుగోడు నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నం ఎస్ఎల్బీసీ,డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేయాలని దేవరకొండ మండల రైతు సంఘం 4వ, మహాసభ మండలంలోని తూర్పుపల్లి గ్రామంలో గంగిడి రాంరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన నర్సింహా రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా కేవలం కమిషన్ ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు మీద శ్రద్ధతో కాలయాపన చేసి నల్లగొండ జిల్లా ప్రాజెక్టు లను గాలికొదిలేసిందని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ 10 ఏళ్ల పాలనలో ఎన్నడూ పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కి గుణపాఠం చెప్పాలని ప్రజలకు సూచించారు.

మాజీ ఎమ్మెల్యే, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉజ్జిని యాదగిరి రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా రైతుల్లో మొదలైన అపోహలను తేటతెల్లం చేసేందుకు రైతు బందు నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయాలని,రైతు భరోసాకు సంభందించిన విధివిధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టం చేయాలని అన్నారు.రైతులకు సంభందించిన రుణమాఫీ చేయాలని కోరారు.

ఈ మహాసభలో ప్రజా నాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి.మైనోద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు దేపా సుదర్శన్ రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి పార్లపల్లి కేశవరెడ్డి,సహాయ కార్యదర్శి నూనె రామస్వామి,మాజీ సర్పంచ్ జగన్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



## ఆట పాటలతో సందడి చేసిన విద్యార్థులు

- తుర్కపల్లి లోని సెయింట్ మేరీస్ సెంటర్ స్కూల్లో ఘనంగా ఉగాది సంబరాలు
- ఉగాది విశిష్టతను తెలియచేసిన కరస్పాండెంట్ ఏళ్ళ వరప్రసాద్ రెడ్డి

✍ జయభేరి, ఏప్రిల్ 8 :

మేడ్చల్ జిల్లా తుర్కపల్లి లోని సెయింట్ మేరీస్ సెంటర్ స్కూల్ లో ఘనంగా ఉగాది సంబరాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రీ ప్రైమరీ నుండి హై స్కూల్ వరకు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ఆట పాటలతో సందడి చేశారు. ఇక ప్రీ ప్రైమరీ విద్యార్థులు తెలుగువారి సాంప్రదాయ దుస్తులు ధరించి అలరించారు. ఇక పాఠశాల అధ్యాపక బృందం ఉగాది పచ్చడి చేసి విద్యార్థులకు పంచి పెట్టారు.ఈ కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ ఏళ్లు వరప్రసాద్ రెడ్డి పాల్గొని ఉగాది యొక్క విశిష్టతను విద్యార్థులకు తెలియచేశారు. ఈ వేడుకల్లో స్కూల్ ఇన్చార్జి గ్రేస్, గౌసియా, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

## మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

- శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన.. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్న నిర్వాహకులు




✍ జయభేరి, ఏప్రిల్ 8 :

మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం బాబాగూడ గ్రామంలో మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులోభాగంగా వైద్యులు బీపీ, షుగర్, కంటి పరీక్షలతో పాటు చెవి, ముక్కు, గొంతు వరిబీజము, కణతులు, థైరాయిడ్, గర్భసంచి సమస్యలు మరియు కుటుంబ నియంత్రణ, చర్మ సంబంధమైన సమస్యలు వంటి వాటికి చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా ఆపరేషన్ అవసరమైన 38 మందిని మెడిసిటీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో మేలు చేస్తాయని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాసులు, కారొబార్ రోజారెడ్డి, వైద్యులు రత్నదీప్, జీవన్, బబిత, మేఘన, మార్కెటింగ్ ఇంచార్జ్ కుమారస్వామి, నాగార్జున, సత్యనారాయణ, జ్యోస్న, గ్రామస్తులు పాల్గొన్నారు.






## ఘనంగా సీఎంఆర్సెట్ కళాశాల వార్షికోత్సవం

- సందడి చేసిన సినీ నటులు

✍ జయభేరి, మేడ్చల్ :

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్సెట్ కళాశాల వార్షికోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. కార్పీడియం 2 కె 24 పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్ రెడ్డి పాల్గొని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు సంస్కృతి కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ,కల్చరల్ హెడ్ రోహిణిరెడ్డి అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు. సందడి చేసిన సినీ నటులు.. సీఎంఆర్ సెట్ కళాశాల వార్షికోత్సవంలో ప్రసన్నవదనం మూవీ టీం, పోట్టెల్ మూవీ టీం లు పాల్గొని సందడి చేశారు. ప్రసన్నవదనం హీరో సుహాస్, హీరోహిన్ పాయల్ రాధాకృష్ణ, రాశీసింగ్, దర్శకుడు అర్జున్, ప్రొడ్యుసర్లు జెఎస్ మణికంఠ, ప్రసాల్ రెడ్డి పాల్గొని తమ చిత్ర వివరాలను వివరించి ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా హీరో సుహాస్ మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఇష్టమైన పని చేయాలని కోరారు. అనంతరం పొట్టెల్ మూవీ హీరో యువ చంద్రకృష్ణ, డైరెక్టర్ సాహిత్ మోత్కూరి, సినీ గాయకుడు నోయల్ పాల్గొని మూవీని సక్సెస్ చేయాలని కోరారు. తన ర్యాప్ సాంగ్స్ తో నోయల్ అలరించారు.

## బెదిరిస్తే బెదిరిపోవడానికి మేం బానిసలం కాదు
# తెలంగాణ జర్నలిస్టులం

- జర్నలిస్టులను బెదిరించిన మాజీ సర్పంచ్ భర్త పి శ్రీనివాస్ పై చర్యలు తీసుకోవాలి
- తెలంగాణ ఎడిటర్స్ అసోసియేషన్ జిల్లా కలెక్టర్ కి వినతి

✍ జయభేరి, కీసర :



కీసర మండలం చీర్యాల గ్రామపంచాయతీ పరిధిలో వ్యవసాయం పంటలు పండించాల్సిన భూముల్లో అక్రమ నిర్మాణాలను మాజీ సర్పంచ్ భర్త పి శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. వివరణ కొరకై వెళ్లిన జర్నలిస్టులను చంపుతానని బెదిరించిన పి శ్రీనివాస్ పై తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎడిటర్స్ అసోసియేషన్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందించారు.

వ్యవసాయ భూమిని రెసిడెన్షియల్, కమర్షియల్ భూములుగా కన్వర్ట్ చేయకుండా యదేచ్ఛగా అక్రమంగా కమర్షియల్ షెడ్ లను నిర్మిస్తున్నారు. దీని ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని గండి కొడుతున్నారు. దీనిపై వివరణ కోరిన జర్నలిస్టులను మాజీ సర్పంచ్ భర్త పి శ్రీనివాస్ పరుష పదజాలంతో దూషించి, చంపుతానని బెదిరించడాన్ని తెలంగాణ ఎడిటర్స్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తున్నది.

చీర్యాల గ్రామంలో దాదాపు రెండు ఎకరాల వ్యవసాయ భూములో పెద్ద పెద్ద రెండు షెడ్లను నిర్మిస్తున్నారు. ఇటీవల గ్రామ పంచాయతీ కార్యదర్శి ఈ షెడ్ల నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేవని వీటి నిర్మాణ ఆపమని నోటీసు జారీ చేసినప్పటికీ, నేనెవరి మాట వినను అంటూ నిర్మాణాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు.

ఇదంతా చీర్యాల గ్రామ మాజీ సర్పంచ్ భర్త పి శ్రీనివాస్ దగ్గరుండి నిర్వహిస్తున్నట్లు గ్రామ ప్రజలు చెబుతున్నారు. కావున జిల్లా కలెక్టర్ ఈ విషయాలపై విచారణ జరిపించి, అక్రమ కట్టడాలపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ నాయకులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎడిటర్స్ అసోసియేషన్ నాయకులు జి హరిప్రసాద్, ఐ సత్యనారాయణ, భూపేంద్ర, డి అరుణ్ కుమార్, రోజా రాణి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల రిటైర్మెంట్ బెనిఫిట్స్ 2లక్షలు ఇవ్వాలి



అంగన్వాడీ టీచర్లు హెల్పర్లకు నష్టం కలిగించే సర్క్యులర్ 1334 వెంటనే ఉపసంహరించుకోవాలని, గత సంవత్సరం లో చేసిన సమ్మె ఒప్పందాలను అమలు చేసి రిటైర్మెంట్ బెనిఫిట్స్ రెండు లక్షలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పల్లా దేవేందర్ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన ప్రభుత్వం 1334 ఐసిడిఎస్ సర్క్యులర్ ద్వారా లక్ష రూపాయలు మాత్రమే బెనిఫిట్స్ ఇస్తామని చెప్పి 65 సంవత్సరాలు నిండిన టీచర్లు ఆయాలను ఇంటికి పంపేందుకు సిద్ధమైందని, సంవత్సరాల తరబడి ప్రజలకు సేవ అందించినటువంటి వారిని ఇంటికి పంపడం అంటే ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా అంగన్వాడీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, ప్రభుత్వం పునరాలోచన చేసి అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, సర్క్యులర్ 1334 రద్దు చేయాలని దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# జంతువులు, పక్షుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్లు

- వేసవిలో తాగునీటి ఎద్దడి కి అన్ని చర్యలు తీసుకోవాలి
- తుంకుంట మున్సిపల్ కార్యాలయం లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన కమిషనర్ వెంకట గోపాల్

✍ జయభేరి, ఏప్రిల్ 8 :




వేసవిలో నీటి ఎద్దడి నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తుంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం పురపాలక సంఘం కార్యాలయం లో వాటర్ వర్క్స్ అధికారులు, ఇతర శాఖల అధికారులతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సరఫరా కొరకు పురపాలక సంఘం కార్యాలయంలో ఒక ప్రత్యేక కంట్రోల్ రూమ్ సెల్ నంబర్ 9912140798 ఏర్పాటు చేసినట్లు, తాగునీటి సరఫరా విషయం లో సమస్యలు ఎదురైతే ఈ నంబర్ కు పిర్యాదు చేయవచ్చునని సూచించారు. అంతేకాక నీటి సరఫరా లో అంతరాయం కలిగితే ట్యాంకర్ల ద్వారా కూడా సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. ఇక జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చాలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జంతువులు, పక్షుల దాహార్తిని తీరిచేందుకు నీటి తొట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా ప్రజలు సైతం తమ ఇంటి మిద్దెల పైన పక్షుల కోసం నీటి తొట్ల ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతే కాకుండా నీటి సరఫరా విభాగంలో పురపాలక సంఘం కార్యాలయం నుండి డిప్యూటీ EE G. సునీత ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రవణ్ కుమార్, భాస్కర్, RO శ్రీనివాస్, HMWS &SB అధికారులు, బిల్ కలెక్టర్ లు తదితరులు పాల్గొన్నారు.



## మండల ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

- నూతన తెలుగు సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి శామీర్ పేట్ తాసిల్దార్ యాదగిరి రెడ్డి



✍ జయభేరి, ఏప్రిల్ 8 :

ఉగాది పండుగ అందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని శామీర్ పేట్ తాసిల్దార్ యాదగిరి రెడ్డి ఆకాక్షించారు. ఈ సందర్భంగా శామీర్ పేట్ మండల ప్రజలకు, అధికారులకు ఆయన ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ తెలుగు సంవత్సరంలో ప్రజలందరూ ఆనందోత్సవాలతో ఉండాలని కోరారు. అదేవిధంగా ఈ క్రోధి నామ సంవత్సరం లో అన్ని వర్గాల ప్రజలకు శుభాలు జరగాలని, అదేవిధంగా జిల్లా మరింత ప్రగతి సాధించాలని ఆకాక్షించారు.



## గ్రామంలో శ్రీరామ నవమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయం

**జయభేరి, ఏప్రిల్ 8 :**

మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం లాల్ గడి మలక్ పేట్ గ్రామంలో ప్రతి యేడు శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం కూడా ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించాలని గ్రామస్తులు, యువకులు నిర్ణయించారు. ఈ మేరకు ఉగాది నాడు నిర్వహించ తలపెట్టిన శ్రీరామనవమి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఇందులో హిందు బంధువులు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

## వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య



**జయభేరి, ఏప్రిల్ 8 :**

వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిస్సా రాష్ట్రానికి చెందిన పింటు సాహు (26),తండ్రిపేరు బలాధీయ సాహూ కుటుంబంతో కలిసి గత కొన్ని నెలల క్రితం బ్రతుకుదెరువు నిమిత్తం శామీర్ పేట్ మండలం మజీద్పూర్ గ్రామంలో నివాసం ఉంటూ లాల్ గడి మలక్ పేట్ ఎచ్ బిఎల్ పని చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. కాగా పింటు సాహు మద్యానికి బానిసై తరచూ భార్య బిష్ణు సాహు మరియు అత్తతో గొడవ పడేవారు. ఆదివారం ఉదయం పింటు సాహు మధ్యం సేవించి ఇంటికి వచ్చి తనకు రూ.150 రూ పాయలు ఇవ్వాలని భార్యతో గొడవ పడ్డాడు భార్య డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో మనస్థాపానికి గుర్రై మద్యం మత్తులో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికిచేరుకుని శవపంచనామ నిర్వహించి పోస్తుమార్థం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుల అరెస్ట్

నిందితుల వద్ద నుండి తులం బంగారం, యాక్టివా వాహనం సీజ్



**జయభేరి, ఏప్రిల్ 8:**

మద్యం మత్తులో ఇద్దరు దుండగులు ఓ వ్యక్తిపై దాడి చేసి అతని మెడలో ఉన్న బంగారు గోలుసుతో పాటు సెల్ ఫోన్ ను అపహరించుకెళ్లారు. ఈ సంఘటన మేడ్చల్ జిల్లా అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అల్వాల్ పరిధిలోని సూర్య నగర్ కు చెందిన ఏ.సురేందర్ రెడ్డి తన ఇంటి వద్ద సిగరెట్ తాగుతూ కూర్చున్నాడు.కాగా ఇదే ప్రాంతంలో ఉంటున్న జంపన్న, గౌతమ్ లు ఇద్దరు స్నేహితులు. వీరిద్దరూ కలిసి గతంలో చోరీలకు పాల్పడి జైలుకు సైతం వెళ్ళొచ్చారు. అయితే ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు రెక్కి నిర్వహించారు. ఇందులో భాగంగా ఈ నెల 7న అల్వాల్ పరిధిలో తిరుగుతుండగా అనుమానం వచ్చిన పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. దింతో నిందితులు చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. గతంలో కూడా అల్వాల్ పరిధిలో 3 చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. వీరి వద్దనుండి తులం బంగారు గొలుసు, చోరిలకు ఉపయోగించిన యాక్టివా ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అయితే ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు రాహుల్ దేవ్ నేతృత్వంలోని డిటెక్టివ్ ఇన్స్ స్పెక్టర్ ఆఫ్ పోలీసు రాజేందర్ గౌడ్ మరియు క్రైమ్ సిబ్బంది విద్యాకర్ రావ్, గోపి పాషా రమాకాంత్, సుధాకర్, లు చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకోవడంతో వీరిని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి రివార్డులు అందించనున్నట్లు వారు పేర్కొన్నారు.



**హ్యాట్రిక్ విజయాలతో దూకుడు మీదున్న కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) జోరుకు డిఫెండింగ్ చాంపియన్స్ చెన్నై సూపర్‌కింగ్స్ (సీఎస్‌కే) బ్రేక్ వేసింది. చెన్నైలోని చెపాక్ స్టేడియంలో కేకేఆర్‌ను ముందు బంతితో కట్టడి చేసిన చెన్నై.. ఆపై బ్యాట్‌తోనూ రాణించి రెండు పరాజయాల తర్వాత మళ్లీ విజయాల బాట పట్టింది. రవీంద్ర జడేజా స్పిన్ మాయాజాలానికి తోడు తుషార్ దేశ్‌పాండే, ముస్తాఫిజుర్ రెహ్మాన్ పేస్‌కు కేకేఆర్ బ్యాటింగ్ ఆర్డర్ విఫలమైంది. సీఎస్‌కే బౌలర్లు వికెట్ల పండుగ చేసుకున్న పిచ్‌పై కోల్‌కతా బౌలర్లు తేలిపోయారు. రుతురాజ్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు.**

# హోం గ్రౌండ్‌లో గర్జించిన చెన్నై..

## ఈ సీజన్‌లో కోల్‌కతాకు తొలి ఓటమి

ఐపీఎల్ 2024 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు.. కోల్‌కతా నైట్‌రైజర్స్‌ను చిత్తుచేసింది. హోం గ్రౌండ్‌లో ఆల్ రౌండ్ షో చేసి సత్తాచాటింది. అలవోకగా గెలిచింది చెన్నై.

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2024 సీజన్‌లో మళ్లీ గెలుపు బాటపట్టింది చెన్నై సూపర్ కింగ్స్. రెండు వరుస ఓటముల తర్వాత మళ్లీ సత్తాచాటి విజయం సాధించింది. హోం గ్రౌండ్ చెపాక్ స్టేడియంలో మరోసారి గర్జించి ఈ సీజన్‌లో మూడో విజయాన్ని నమోదు చేసుకుంది. చెన్నైలోని చెపాక్ వేదికగా నేడు (ఏప్రిల్ 8) కోల్‌కతా నైట్ రైడర్స్ టీమ్‌తో జరిగిన మ్యాచ్‌లో సీఎస్‌కే ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆల్ రౌండ్ షో చేసి అలవోకగా గెలిచింది. ఈ ఐపీఎల్ 2024 సీజన్‌లో కోల్‌కతాకు ఇది తొలి ఓటమిగా ఉంది.

**అదరగొట్టిన చెన్నై బౌలర్లు**

ఈ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లు సత్తాచాటి ఈ సీజన్‌లో జోరు మీద ఉన్న కోల్‌కతా నైట్ రైడర్స్ బ్యాటర్లకు కళ్లెం వేశారు. చెన్నై స్టార్ స్పిన్నర్ రవీంద్ర జడేజా 4 ఓవర్లలో కేవలం 18 పరుగులు ఇచ్చి మూడు వికెట్లతో రాణించాడు. తుషార్ దేశ్‌పాండే మూడు, ముస్తాఫిజుర్ రహమాన్ రెండు వికెట్లతో సత్తాచాటారు. తీక్షణ పొదుపుగా బౌలింగ్ చేసి ఓ వికెట్ తీశాడు. చెన్నై బౌలర్లు సమిష్టిగా సత్తాచాటటంతో ముందుగా బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లకు 137 పరుగులు మాత్రమే చేయలిగింది. కేకేఆర్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (34), సునీల్ నరేన్ (27) మినహా మిలిగిన బ్యాటర్లు విఫలమయ్యారు. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (0)ను ఈ మ్యాచ్‌లో తొలి బంతికే ఔట్ చేశాడు చెన్నై పేసర్ దేశ్‌పాండే. సునీల్ నరేన్ (27), అంగ్‌క్రిష్ రఘువంశీ (24), వెంకటేశ్ అయ్యర్ (3)ను జడేజా ఔట్ చేశాడు. రింకూ సింగ్ (9), డేంజరస్ ఆండ్రే రసెల్ (10)ను త్వరగా పెవిలియన్ పంపి అదరగొట్టాడు దేశ్‌పాండే. వరుసగా వికెట్లు కోల్పోయిన కోల్‌కతా పెద్ద స్కోరు చేయలేకపోయింది.

**రుతురాజ్ చివరి వరకు నిలిచి..**

ఈ మోస్తరు లక్ష్యాన్ని చెన్నై సూపర్ కింగ్స్ 14 బంతులను మిగిల్చి మరీ ఛేదించింది. 17.4 ఓవర్లలో 3 వికెట్లకు 141 పరుగులు చేసి విజయం సాధించింది చెన్నై. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (67 నాటౌట్) అర్ధ శతకంతో చివరి వరకు నిలిచాడు. డారిల్ మిచెల్ (25), శివమ్ దూబె (28) కూడా రాణించారు. 18 బంతుల్లోనే 3 సిక్స్‌లు, ఓ ఫోర్‌తో దూకుడుగా ఆడాడు దూబే. 45 బంతుల్లో హాఫ్ సెంచరీ మార్క్ చేరిన గైక్వాడ్.. చివరి వరకు నిలిచి బాధ్యతగా కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు.

**జడేజాను ఆపి.. వచ్చిన ధోనీ**

శివమ్ దూబే ఔటయ్యాక.. రవీంద్ర జడేజా బ్యాటింగ్‌కు దిగేందుకు రెడీ అయ్యాడు. గ్రౌండ్‌లోకి వెళ్లేందుకు నిల్చున్నాడు. అయితే, ఆ సమయంలో జడేజాను మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ (1 నాటౌట్) బ్యాటింగ్‌కు వచ్చాడు. హోం గ్రౌండ్‌లో తన బ్యాటింగ్ చూడాలని ఆశగా ఉన్న అభిమానుల కోసం మహీ బరిలోకి దిగాడు. ధోనీ గ్రౌండ్‌లోకి వచ్చిన సమయంలో చెపాక్ స్టేడియంలో మోతెక్కించారు ప్రేక్షకులు. ఐపీఎల్ 2024 సీజన్‌లో వరుసగా మూడు విజయాలతో జోష్ చూపిన కోల్‌కతాకు ఇదే తొలి ఓటమి. ప్రస్తుతం ఆరు పాయింట్లతో పట్టికలో రెండో స్థానంలో కేకేఆర్ ఉంది. ఐదు మ్యాచ్‌ల్లో మూడు గెలిచిన చెన్నై సూపర్ కింగ్స్.. నాలుగో స్థానంలో ఉంది.

# ఉగాది పచ్చడి శరీరానికి మంచిది..



ఉగాది అనగానే మొదట గుర్తొచ్చేది ఉగాది పచ్చడి. హిందూవులు కచ్చితంగా ఈ పండుగ రోజున పచ్చడి చేసుకుని తీసుకుంటారు. ఇందులో చాలా ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయి.

జీవితంలో సంతోషాలు ఎలా ఉంటాయో, దు:ఖాలు కూడా అంతే. ఉగాది పండుగ కుడా అదే విషయాన్ని చెబుతుంది. అయితే ఉగాది పచ్చడి చేసుకోవడంలో సాంప్రదాయం మాత్రమే కాదు.. అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఆరు రకాల రుచులు అనేక ఉపయోగాలను అందిస్తాయి. ఇందులో ఉపయోగించే బెల్లం, చింతపండు రసం, మామిడి, వేప, కారం, ఉప్పు.. అన్నీ మీకు మంచి చేసేవే. ప్రత్యేకంగా వేప, బెల్లం కలిపి తీసుకుంటే ఊహించని ప్రయోజనాలు పొందుతారు.

వివిధ రకాలుగా శరీరంలో వ్యాధులు వేళ్లూనుకుంటాయి. రోగనిరోధక వ్యవస్థ బలహీనమైనప్పుడు కొన్నిసార్లు మనం అనారోగ్యం పాలవుతాం. కొన్నిసార్లు వైరస్ లేదా బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ వస్తుంది. మన అనారోగ్యకరమైన జీవనశైలి కారణంగా వివిధ సంక్లిష్ట వ్యాధులు శరీరంలో గూడు కట్టడం ప్రారంభిస్తాయి. అందువల్ల ఆరోగ్యంగా ఉండటానికి, మీరు మొదట జీవన విధానానికి శ్రద్ధ వహించాలి.

ఉగాది రోజున కలిపి తీసుకునే బెల్లం, వేప పువ్వు మీ ఆరోగ్యానికి అద్భుతాలు చేస్తుంది. శరీరంలో నిల్వ ఉన్న వివిధ రకాల విష పదార్థాలను తొలగించేందుకు ఈ హోం రెమెడీకి ప్రత్యామ్నాయం లేదు. ఎందుకంటే వేపలో పెద్ద మొత్తంలో ప్రయోజనకరమైన ఎంజైమ్‌లు ఉంటాయి. ఇవి శరీరంలో ఉండే హానికరమైన టాక్సిన్స్‌ను తక్షణమే తొలగిస్తాయి. ఫలితంగా ఏ వ్యాధికి అవకాశం ఉండదు.

వేపలో ఉండే ప్రయోజనకరమైన ఎంజైమ్‌లు కడుపులో ఉండే లెక్కలేనన్ని హానికరమైన సూక్ష్మజీవులను చంపుతాయి. ఫలితంగా, జీర్ణక్రియకు సంబంధించిన వివిధ వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది.

బరువు తగ్గాలని నిశ్చయించుకున్న వారు ఈ వేప, బెల్లం మిశ్రమాన్ని రోజూ తీసుకుంటే కూడా మంచిది. ఎందుకంటే ఈ ఔషధం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇది కొవ్వును కాల్చే శరీర సామర్థ్యాన్ని కూడా పెంచుతుంది. ఫలితంగా కొవ్వు త్వరగా కరుగుతుంది. బరువు తగ్గడం ప్రారంభమవుతుంది.

ఉగాది పచ్చడి గ్యాస్ట్రోప్రొటెక్టివ్ ఎలిమెంట్ ను కలిగి ఉంటుంది. ఇది కడుపు పుండు అవకాశాలను పూర్తిగా తగ్గిస్తుంది. కడుపు పూతలతో బాధపడుతున్న రోగులు కూడా దీనిని తీసుకోవచ్చు. మీరు ప్రయోజనం పొందుతారు.

వేప, బెల్లంలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి చర్మాన్ని UV కిరణాల నుండి రక్షించడమే కాకుండా, వివిధ వ్యాధులను తగ్గించడం ద్వారా చర్మాన్ని ప్రకాశవంతంగా మార్చడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అధిక యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాల కారణంగా ఏ రకమైన గాయమైనా త్వరగా నయం చేయడానికి ఇది గొప్పది. వేప, బెల్లం రెండూ రోగనిరోధక శక్తిని బలోపేతం చేసే యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి.

ఉగాది పచ్చడిలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వల్ల ఆరోగ్యానికి చాలా మంచిది. ఇవి శరీరంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచుతాయి. శరీరంలోని మలినాలను తొలగిస్తాయి. వాపు సమస్య ఉన్నవారికి ఇది చాలా మంచిది.

మామిడి అనేది సీజనల్ ఫుడ్, ఏదైనా సీజనల్ ఫుడ్ తింటే ఆరోగ్యానికి చాలా మంచిది. మామిడి వడదెబ్బను నివారించడంలో సహాయపడుతుంది. దీన్ని తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

ఎండలో బెల్లం నీరు తాగడం చాలా మంచిది. ఎండలో అలసటను త్వరగా తగ్గిస్తుంది. నల్ల మిరియాలు ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. అజీర్ణం, డిప్రెషన్, దగ్గు మొదలైన వ్యాధులను నివారించే శక్తి ఉంది. ఉగాదిలో చేసే పచ్చడి చాలా ప్రత్యేకం. అందుకే ఉగాది పచ్చడి మీ ఆరోగ్యాన్ని కాపాడుతుంది.






ఉగాది శుభాకాంక్షలు



## ఊరమాస్ గా 'పుష్ప 2' టీజర్.. అమ్మవారి గెటప్ లో అల్లు అర్జున్ ఊచకోత

నేడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు. ఈ సందర్భంగా సినీ ప్రముఖులతో పాటు పలువురు సెలబ్రిటీలు బన్నికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అయితే అల్లు అర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ పుష్ప.. ది రూల్. ఈ సినిమాకు లెక్కల మాస్టార్ సుకుమార్ దర్శకత్వం వహిస్తుండగా.. కన్నడ భామ రష్మిక మందన్నామరోసారి ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. ఈ సినిమా నుంచి నేడు బన్ని బర్త్ డే కానుకగా టీజర్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. ఇక ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అభిమానులతో పాటు మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన సమయం రానే వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ టీజర్ విడుదల చేశారు. గంగమ్మ తల్లి జాతరలో అమ్మవారి గెటప్ లో అల్లు అర్జున్ ఫైట్ సీన్‌తో ఫుల్ యాక్షన్ ప్యాక్ టెడ్‌గా సాగింది ఈ టీజర్. ఇక నెట్టింట రికార్డు వ్యూస్‌తో దూసుకుపోతున్నా టీజర్‌ను మీరు చూసేయండి. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ తెరకెక్కిస్తున్న సీక్వెల్ ప్రాజెక్టులో కన్నడ భామ రష్మిక మందన్నామరోసారి ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది.

## ఆరోగ్యం కోసం ఐదు సూత్రాలు..
### సమంత మార్నింగ్ రొటీన్ ఇదీ

స్టార్ హీరోయిన్ సమంత గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. అందం, అభినయంతో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. దక్షిణాదిలో స్టార్ హీరోయిన్‌గా నిలిచింది. సౌత్‌లోనే కాదు నార్త్‌లోనూ సామ్‌కు మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఇక సామ్.. గత కొన్ని రోజులుగా మయోసైటిస్ తో బాధపడుతున్న విషయం తెలిసిందే. దాన్నుంచి పూర్తిగా కోలుకునేందుకు సినిమాల నుంచి బ్రేక్ తీసుకుంది. ప్రస్తుతం తన ఆరోగ్యంపై పూర్తిగా దృష్టి పెట్టింది. అనారోగ్య సమస్యల గురించి అందరికీ అవగాహన కల్పించేందుకు ఒక పాడ్ కాస్ట్ కూడా ప్రారంభించింది. అందులో ఆరోగ్యంతోపాటు తన పర్సనల్ లైఫ్ విషయాలను కూడా షేర్ చేసుకుంటోంది.

తాజాగా తన మార్నింగ్ రొటీన్ గురించి ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించింది. ఆరోగ్యం కోసం తను ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటుందో వివరించింది. ఉదయం ఎన్ని గంటలకు మేలుకుంటోంది.. లేచాక ఏమేం చేస్తుందనే ప్రతి విషయాన్ని పాడ్ కాస్ట్ ద్వారా అభిమానులతో పంచుకుంది. 'నేను ఉదయం 5:30 గంటలకు మేల్కొంటాను. లేవగానే జర్నలింగ్ తో నా రోజును ప్రారంభిస్తాను. గ్రాటిట్యూడ్ జర్నల్ రాస్తాను. ఆ తర్వాత ఐదు నిమిషాల పాటు సూర్య కిరణాలను ఆస్వాదిస్తాను. ఆ తర్వాత బ్రీత్ ఎక్సర్‌సైజ్‌లు చేస్తాను. ఇందు కోసం నేను విమ్ హోఫ్ మెథడ్ ఫాలో అవుతాను. నేను గత కొంతకాలంగా ఇషా క్రియా చేస్తున్నాను. 25 నిమిషాల పాటు మెడిటేషన్ చేస్తాను. అలాగే కొద్ది నెలలుగా టాపింగ్ చేయడం (తలపై చేతి వేళ్లతో మసాజ్‌లా చేయడం) ప్రారంభించాను. ఇలా చేయడం వల్ల మన ఎనర్జీ బ్యాలెన్స్ చేయడానికి సాయపడుతుంది. దీని వల్ల పెయిన్స్ నుంచి రిలీవ్ ఉంటుంది. సో.. జర్నలింగ్, సన్ సోక్, విమ్ హోఫ్, మెడిటేషన్, ట్యాపింగ్. ఈ ఐదింటి వల్ల జీవితంలో గొప్ప మార్పులు జరుగుతాయి' అంటూ తన మార్నింగ్ రొటీన్ గురించి సామ్ వివరించింది.



## రియల్ లైఫ్‌ను తలపించే డియర్

'డియర్' కథను ఐశ్వర్య రాజేశ్ నా దగ్గరకు తెచ్చారు. కథ విన్నప్పుడు, ప్రతి సన్నివేశం రియల్ లైఫ్‌తో రిలేట్ చేసుకునేలా అనిపించింది. ఈ కథ భావోద్వేగాల కలబోత. దర్శకుడు ఆనంద్ కథను అద్భుతంగా మలిచాడు.' అని జి.వి.ప్రకాశ్‌కుమార్ అన్నారు. ఆయన హీరోగా నటించిన వినోదభరిత కుటుంబకథాచిత్రం 'డియర్'. ఐశ్వర్య రాజేశ్ కథానాయిక. ఆనంద్ రవిచంద్రన్ దర్శకుడు. వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, జి.పృథ్వీరాజ్ నిర్మాతలు. ఈ నెల 11న తమిళంలో, 12న తెలుగులో సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ వేడుకలో చిత్ర కథానాయకుడు జి.వి.ప్రకాశ్‌కుమార్ మాట్లాడారు. హీరో సందీప్‌కిషన్, నిర్మాత సూర్యదేవర నాగవంశీ, దర్శకులు వెంకీ అట్లూరి, నందిని రెడ్డి అతిథులుగా హాజరై చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'భాష ఏదైనా కంటెంట్ బాగుంటే ఆదరించడంలో తెలుగువారు ముందుంటారు. అందుకే ఈ సినిమాను కూడా తప్పక ఆదరిస్తారని నా నమ్మకం. నేను తెలుగమ్మాయిని. ఎప్పట్నుంచో తెలుగులో ఓ స్ట్రయిట్ సినిమా చేయాలనేది నా ఆకాంక్ష. ఇందులో నేను, జీవీ కలిసి నటించిన సీన్లు యూత్‌ని విశేషంగా ఆకట్టుకుంటాయి. దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించాడు. సినిమా చూసిన తర్వాత చిరునవ్వుతో బయటికొస్తారు' అని ఐశ్వర్య అన్నారు. గురకపెట్టడం ప్రతి ఇంట్లో ఉండే సమస్యేననీ, దానిపై కథ రాయడం ఎక్సయిటింగ్‌గా అనిపిందనీ, ట్రైలర్‌కి వాయిస్ ఇచ్చిన నాగచైతన్యకు ధన్యవాదాలని దర్శకుడు చెప్పారు. ఇంకా నటి రోహిణి, నిర్మాత త్రిపురనేని వరుణ్, అభిషేక్ రామిశెట్టి కూడా మాట్లాడారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com